క్లుప్తంగా

చెస్ విజేతలకు బహుమతుల ప్రదానం



చెస్ విజేతలతో పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరెడ్డి

బిక్కవోలు: పందలపాకలోని పడాల పెద్ద పుల్లారెడ్డి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో చెస్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఆ పాఠశాలలో శనివారం అంతర్జాతీయ చదరంగం దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మకత, మేధా సంపత్తిని వెలికి తీయడానికి చెస్ బాగా ఉపయోగపడుతుందన్నారు. మానసిక ఒత్తిడి నుంచి బయట పడడానికి తోడ్పడుతుందన్నారు. చెస్ పోటీల విజేతలైన గొర్రిపోటి బాలసాయి నిఖిల్, ధనుష్, లీలా స్వాతి, సూర్య శశి, అక్షర, సాయి సుష్మలకు బహుమతులు అందజేశారు. ఈ బహుమతులను గొల్లలమామిడాడ సూర్య లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సబ్బెళ్ల శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి దార్వంపూడి యువరాజారెడ్డి సమకూర్చారు. కార్యక్రమంలోని ఉపాధ్యాయులు కర్రి వీర్రెడ్డి, నాగబాబు, చిలుకూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణతోనే ప్రజల ఆరోగ్యం



పెదపూడిలో ప్రతిజ్ఞ చేయిస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి

పెదపూడి: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ మెరుగ్గా ఉంటేనే ప్రజల ఆరోగ్యం బాగుంటుందని డిప్యూటీ ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. పారిశుధ్య నిర్వహణ, తడి, పొడి చెత్త సేకరణ, సీజనల్ వ్యాధులపై శనివారం పెదపూడిలో వర్క్‌షాప్ నిర్వహించారు. దీనికి గంగ్రేడు, పెద్దాడ, కైకవోలు, కుమారప్రియం, పెదపూడి గ్రామాల సచివాలయం కార్యదర్శులు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, వెలుగు కార్యాలయం సిబ్బంది, డ్వాక్రా మహిళలు హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీవో మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజానికి, ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి అధికారులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం వద్ద స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మానవహారం నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని ప్రతిజ్ఞ చేశారు.

అభ్యంతరాలుంటే తెలపండి



మునికూడలిలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్

సీతానగరం: కచ్చితమైన హద్దుల గుర్తింపు కోసమే భూ రీసర్వే నిర్వహించామని, రైతులు ఎవరికైనా అభ్యంతరాలు దరఖాస్తు చేసుకోవచ్చని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో మునికూడలి సచివాలయం వద్ద శనివారం గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భూ రీసర్వే పూర్తయిందని, సరిహద్దులు గుర్తించడం జరిగిందన్నారు. రీ సర్వే డీటీ సీతారామయ్య, సర్వేయర్ గౌతమ్, వీఆర్వో కుమారి పాల్గొన్నారు.

రామకృష్ణ మఠంపై దాడి

కంబాలచెరువు: కోరుకొండ రోడ్డులోని రామకృష్ణ మఠంపై శనివారం కొందరు దాడి చేశారు. దీనిపై మఠం మెడికల్ క్యాంప్ కో ఆర్డినేటర్ కనుమోలు శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. రాజానగరం మండలం నరేంద్రపురానికి చెందిన ఉల్లి సంతోష్ రెండేళ్లుగా రామకృష్ణ మఠానికి వస్తున్నాడు. అక్కడ నిత్యం పుస్తక పఠనం చేస్తున్నాడు. అతడు ధ్యానంలో పూర్తిగా ఆధ్యాత్మికతలోకి వెళ్లిపోయాడు. దీంతో అతడి కుటుంబీకులు, అత్తింటివారు సుమారు 20 మందిపైగా రామకృష్ణ మఠంలోకి చొచ్చుకెళ్లి ఆందోళన చేశారు. సంతోష్ అలా తయారవ్వడానికి మీరే కారణమంటూ మఠంలోని వారితో వాగ్వాదానికి దిగారు. దీంతో మఠం నిర్వాహకులు పోలీసులను ఆశ్రయించారు.

పనుల ప్రగతిపై సమీక్ష

రాజానగరం: స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపర్చాలనే ఉద్దేశంతో కలవచర్లలో 104 ఎకరాలలో ఏర్పాటు చేస్తున్న ఇండస్ట్రియల్ పార్కులో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు 396 ప్లాట్లు రెడీగా ఉంటాయని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తెలిపారు. ఈ విషయమై సంబంధిత అధికారులతో శనివారం సమావేశమై, ఇండస్ట్రియల్ పార్కులో జరుగుతున్న మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన పనుల ప్రగతిపై సమీక్షించారు. త్వరలోనే ఈ పార్కును ప్రారంభిస్తామన్నారు.

నీరు లేక.. దాహం తీరక..

- సత్యసాయి పథకం కార్మికుల సమ్మె
- నిలిచిన గోదావరి శుద్ధి జలాల సరఫరా
- 90 గ్రామాల్లో తాగునీటికి కటకట
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు



రాజమహేంద్రవరంలో నిరసన తెలుపుతున్న సత్యసాయి పథకం కార్మికులు

సీతానగరం: పురుషోత్తపట్నంలోని సత్యసాయి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టు నుంచి శుద్ధి చేసిన గోదావరి నీరు విడుదల కాకపోవడంతో సుమారు 90 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు 19 నెలలుగా వేతనాలు రాకపోవడంతో ఆ పథకం కార్మికులు సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో గోదావరి జలాల విడుదల ఆగిపోయింది. ఆయా గ్రామాల ప్రజలు తాగునీటి కోసం ఎదురుచూస్తున్నారు. సత్యసాయి పథకం కార్మికులతో అధికారులు చర్చలు జరిగి, తాగునీటిని విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. సుమారు పదిహేను రోజులుగా నీటి విడుదల నిలిచిపోవడంతో దాదాపు మూడు లక్షల మంది తాగునీటి కోసం అలమటిస్తున్నారు.

కుటుంబం గడిచేదెలా..

తమకు వేతనాలు ఇవ్వకుండా కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలని సత్యసాయి పథకం కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకటి కాదు, రెండు కాదు దాదాపు 19 నెలల జీతాలు రావాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకూ అప్పులు చేసి, దుకాణాల్లో అరువులు పెట్టి సరకులు తీసుకున్నామని, ఇప్పుడు వారు కూడా ఇవ్వని పరిస్థితి ఏర్పడిందన్నారు. వేతనాల కోసం నాలుగు నెలల క్రితం గోకవరం నుంచి రాజమహేంద్రవరం ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కార్యాలయం వరకు పాదయాత్రగా వెళ్లి, నిరసన తెలిపామన్నారు. ఆ సమయంలో రెండు నెలల జీతాలు అందించి మమ అనిపించారని, మళ్లీ ఇవ్వడం మానివేశారన్నారు.

సమ్మెబాట

తమ వేతనాల బకాయిలను విడుదల చేయాలంటూ ఈ నెల 8వ తేదీ నుంచి సత్యసాయి ప్రాజెక్టు కార్మికులు సమ్మె బాట పట్టారు. దీంతో గోదావరి శుద్ధి జలాల విడుదల ఆగిపోయింది. రాజమహేంద్రవరంలోని ఆర్‌డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం వద్ద వారందరూ రిలే దీక్షలు చేపట్టారు. దీంతో పురుషోత్తపట్నం, ఇందుకూరిపేట, కోరుకొండలోని మెయిన్ ప్రాజెక్టుల నుంచి నీరు విడుదలకు బ్రేక్ పడింది.



దేవీపట్నం మండలం శరభవరంలో వెలవెలబోతున్న వాటర్ ట్యాంక్



దేవీపట్నం మండలం భీమ్‌పల్లి పోలవరం పునరావాస కాలనీ-1లో..

90 గ్రామాలకు నిలిచిన తాగునీరు

సత్యసాయి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టు కార్మికుల సమ్మెతో దేవీపట్నం, కోరుకొండ, సీతానగరం, గోకవరం, రాజానగరం మండలాల్లోని 90 గ్రామాలకు గోదావరి జలాలు నిలిచిపోయాయి. సుమారు మూడు లక్షల మందికి పైగా ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. చాలా గ్రామాల్లో ఆర్వో ప్లాంట్ల నుంచి తాగునీరు తెచ్చుకుంటున్నారు. దాదాపు 13 రోజులుగా నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక ఏజెన్సీ గ్రామాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది.

ఇబ్బంది పడుతున్నాం



గోదావరి తాగునీరు రాకపోవడంతో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. దాదాపు 15 రోజులుగా నీరు రావడం లేదు. ప్రైవేటు ఆర్వో ప్లాంట్ల నుంచి నీటిని తెచ్చుకుంటున్నా, వాటిని తాగలేకపోతున్నాం. నీరు మారడంతో ఆరోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయి. ప్రాజెక్టు కార్మికులకు వెంటనే జీతాలు అందించి, తాగునీటిని విడుదల చేయించాలి.

– పెంద్ర వెంకటలక్ష్మి, సీతానగరం

కార్మికులకు జీతాలు ఇవ్వాలి



సత్యసాయి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టు కార్మికులకు వెంటనే వేతనాల బకాయిలు విడుదల చేయాలి. వారికి జీతాలు ఇవ్వకుంటే కుటుంబాన్ని ఎలా పోషించుకుంటారు. సుమారు 15 రోజులుగా తాగునీరు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. దూర ప్రాంతాలకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సి వస్తోంది. గోదావరి నీటికి అలవాటు పడడంతో ఆర్వో ప్లాంట్ నీరు తాగలేకపోతున్నాం.

– ఇండిగమిల్లి నాగమణి, రాపాక

పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వానికి పట్టదా?

- కూటమికి రైతుల కష్టాలు కనిపించడం లేదు
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి ఆగ్రహం
- ఎండిపోయిన పొలాలు, చెరువుల పరిశీలన



రంగంపేటలో ఎండిపోయిన చెరువును పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి



ఏడీబీ రోడ్డుపై నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ శ్రేణులు, రైతులు

రంగంపేట: మెట్ట ప్రాంతమైన రంగంపేట మండలంలో వర్షాలు పడక, చెరువుల్లో నీరు లేక పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వానికి పట్టదా అని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ప్రశ్నించారు. కూటమి పాలకులకు రైతుల కష్టాలు కనిపించకపోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన శనివారం రంగంపేట మండలంలోని ఎండిపోయిన పొలాలు, చెరువులను పరిశీలించారు. రంగంపేట–వడిశలేరు గ్రామాల మధ్య ఎండిపోయిన చెరువు గర్భంలో నిలబడి డాక్టర్ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రంగంపేట మండలానికి జూన్‌లోనే సాగునీరు అందించేవారమన్నారు. ఇప్పటి ప్రభుత్వం జూలై 20 వచ్చినా పొలాలకు నీరు ఇవ్వడం పోవడం దారుణమన్నారు.

అక్రమార్జనపైనే ఎమ్మెల్యే దృష్టి

ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అక్రమంగా మట్టి అమ్ముకుని డబ్బు సంపాదించడంపైనే దృష్టి సారించారని, అందుకే ఎత్తిపోతల పథకాల నుంచి నీరు విడుదల చేయకుండా చెరువులను ఎండబెట్టి, మట్టి దందా చేస్తున్నారని డాక్టర్ సూర్యనారాయణరెడ్డి విమర్శించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు సొంత నిధులు రూ.40 లక్షలు, అప్పటి రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ద్వారా సుమారు రూ.70 లక్షలు నిధులతో ఎత్తిపోతల పథకాల పనులు చేపట్టామన్నారు. తమ హయాంలో ఒక్క చెరువును కూడా ఎండనివ్వలేదని, రైతులకు ఎన్నడూ నీటి కొరత రానివ్వలేదని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్ని వ్యవస్థలు సక్రమంగా పని చేసేవన్నారు. కూటమి పాలనలో పంటలకు సరైన ధర లేదని, కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బులు ఇవ్వడం లేదని, కనీసం సాగునీరు కూడా అందించడం లేదని మాజీ ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు.

ఏడీబీ రోడ్డుపై నిరసన

చాగల్నాడు, పుష్కర, వెంకట నగరం ఎత్తిపోతల పథకాల ఆయకట్టులో గల పొలాలను డాక్టర్ సూర్యనారాయణరెడ్డి పరిశీలించి, అక్కడి రైతులతో మాట్లాడారు. అప్పులు చేసి, పెట్టుబడి పెట్టి సాగు ప్రారంభించామని నీరు లేక పొలాలు బీరువాడి పోతున్నాయని రైతులు వాపోయారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ రైతుల పక్షాన అండగా నిలబడి న్యాయం జరిగే వరకు పోరాడుతుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రైతులకు సాగునీరు అందించాలని లేని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఏడీబీ రోడ్డుపై రైతులతో కలిసి నిరసన తెలిపి, తహసీల్దార్ కోసు అనసూయకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయేలు, పార్టీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాస రావు, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, వైస్ ఎంపీపీ మట్టా శ్రీను, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రైతులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఎరువుల పంపిణీ



భూపాలపట్నం స్టాక్ పాయింట్‌లో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజానగరం: సహకార సంఘాల ద్వారా ఎరువుల పంపిణీ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థంగా నిర్వహించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. వాటిలో తేడాలు జరిగితే ఉపేక్షించేది లేదని సిబ్బందిని హెచ్చరించారు. మండలంలోని కానవరం, భూపాలపట్నం సహకార సంఘాలకు చెందిన తోకాడ, భూపాలపట్నంలోని స్టాక్ పాయింట్లను శనివారం ఆకస్మికంగా సందర్శించారు. అక్కడ ఎరువుల పంపిణీకి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం జిల్లాకు కేటాయించిన ఎరువులను ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల ద్వారా సమానంగా పంపిణీ చేయాలన్నారు. ఎకరానికి ఎన్ని బస్తాల ఎరువులు అవసరమో అక్కడ ఉన్న కొంతమంది రైతులను అడిగి తెలుసుకున్న కలెక్టర్.. అవసరానికి మించి ఎరువుల వినియోగం జరుగుతుందనే విషయాన్ని గ్రహించారు. ప్రతి యూరియా బస్తాపై ప్రభుత్వ రూ.1,542 సబ్సిడీ ఇస్తున్న క్రమంలో ఎరువుల దుర్వినియోగం జరగకుండా మండల స్థాయిలో రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యాన శాఖ, సహకార శాఖల అధికారులతో ప్రత్యేక బృందాలను వేసి ఎరువుల పంపిణీని పర్యవేక్షించాలని సూచించారు. ఆమె వెంట జిల్లా సహకారశాఖ అధికారి ఎం.వెంకట రమణ, మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ డి.ప్రతాప్, తహసీల్దార్ జీఏఎల్ఎస్ దేవి తదితరులు పాల్గొన్నారు.

‘నన్నయ’లో క్వాంటం టెక్నాలజీ సదస్సు



మాట్లాడుతున్న ఆచార్య కేవీ స్వామి

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్యాంపస్‌లోని కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో క్వాంటం టెక్నాలజీపై ఏఐసీటీఈ – ఏటీఏఎల్ స్పాన్సర్డ్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎఫ్‌డీపీ) శనివారం ముగిసింది. క్వాంటం టెక్నాలజీల రంగాన్ని అన్వేషించడమే లక్ష్యంగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ), నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ) ఆధ్వర్యంలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం హర్షణీయమని రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి అన్నారు. ఎఫ్‌డీపీ కన్వీనర్ డాక్టర్ వి.పెర్సిస్ మాట్లాడుతూ 49 మంది వరకు ఫ్యాకల్టీ సభ్యులు హాజరైన ఈ కార్యక్రమం ఆరు రోజులు జరిగిందన్నారు. డాక్టర్ కార్తిక్ శేషాద్రి, డాక్టర్ జయకుమార్ వైద్యనాథన్, డాక్టర్ సత్యప్రకాష్ పళనియప్పన్, డాక్టర్ అశ్వత్ బాబు, డాక్టర్ సంజయ్ కుమార్, డాక్టర్ పిల్లి ఇమానియేల్ శుభకర్ క్వాంటం టెక్నాలజీలో వివిధ అంశాలపై ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి. వెంకటేశ్వరరావు, కో కన్వీనర్ డాక్టర్ జి.కీర్తి మరిట, సీఎస్ఈ హెచ్ఓడీ డాక్టర్ బి.కెజియా రాణి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కాలుష్యానికి ముగింపు పలుకుదాం



బిక్కవోలులో ర్యాలీ చేస్తున్న అధికారులు

బిక్కవోలు: ప్లాస్టిక్ కాలుష్యానికి ముగింపు పలకాలని వక్తలు అన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం బిక్కవోలులో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం తగ్గించడం ద్వారా పర్యావరణాన్ని రక్షించుకోవాలన్నారు. తహసీల్దార్ బీఎస్‌వీవీ కృష్ణ, సర్పంచ్ సరెళ్ల సుమలత, డిప్యూటీ ఎంపీడీవో ఎస్.జాన్ మిల్టన్ పాల్గొన్నారు.

సీతానగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం కారణంగా పర్యావరణ కాలుష్యం పెరుగుతోందన్నారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిద్దామని ప్రతిజ్ఞ చేశారు.

కోరుకొండ: మండలకేంద్రమైన కోరుకొండలో శనివారం ర్యాలీ, మానవహారం నిర్వహించారు. తొలుత గ్రామ సచివాలయం నుంచి సర్పంచ్ కర్రి లక్ష్మీ సరోజ ఆధ్వర్యంలో ర్యాలీ ప్రారంభించారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మహేశ్వర ప్రతాప్, పంచాయతీ కార్యదర్శి రమేష్‌బాబు, ప్రజలు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి డిగ్రీలు దోహదం

- ఐఐఎస్‌సీ మాజీ డిప్యూటీ డైరెక్టర్ జయంత్
- జీజీయూలో గ్రాడ్యుయేషన్ డే



గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేస్తున్న ప్రముఖులు

రాజానగరం: చదువుకుని సంపాదిస్తున్న డిగ్రీలు ఆయా వ్యక్తుల వ్యక్తిగత అభివృద్ధికే కాకుండా దేశాభివృద్ధికి కూడా తోడ్పతాయని బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ) మాజీ డిప్యూటీ డైరెక్టర్ ఆచార్య జయంత్ ఎం.మోదక్ అన్నారు. స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ)లో శనివారం జరిగిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దేశంలో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో ప్రకారం ప్రాథమిక స్థాయి నుంచి సెకండరీ స్థాయి వరకు 25 కోట్ల మంది విద్యను అభ్యసిస్తుంటే, వారిలో ఉన్నత పాఠశాల తర్వాత 66 శాతం మాత్రమే విద్యను కొనసాగిస్తున్నారన్నారు. ఈ క్రమంలో ఉన్నత విద్యను పూర్తి చేసేవారు 25 శాతం ఉండటం విచారకరమన్నారు. దాన్ని 50 శాతానికి పెంచాలనేదే జాతీయ విద్యా విధానం 2020 లక్ష్యమన్నారు.

పరిశోధనలపై దృష్టి సారించాలి

సభకు అధ్యక్షత వహించిన జీజీయూ చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్య రాజు) మాట్లాడుతూ విద్యార్థులు పరిశోధనల వైపు దృష్టిని సారించి, సమాజానికి, దేశానికి ప్రయోజనం చేకూర్చే పరిశోధనలు చేయాలన్నారు. ప్రొ.చాన్సలర్ కె.శశికిరణ్‌వర్మ మాట్లాడుతూ అన్ని రంగాలలో పోటీతత్వం పెరుగుతున్న నేపథ్యంలో నిరంతరం నూతన విజ్ఞానాన్ని ఆర్జించేందుకు గ్రాడ్యుయేట్లు కృషి చేయాలన్నారు. అనంతరం బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు పూర్తి చేసిన 800 విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో వీసీ డాక్టర్ యు.చంద్రశేఖర్, ప్రొ.వీసీ డాక్టర్ కేవీబీ రాజు, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

టీనేజ్ ప్రేమలతో అనర్థాలు

- డాక్టర్ హిప్నో పద్మా కమలాకర్
- వసతి గృహం బాలికలకు అవగాహన

కంబాలచెరువు: టీనేజ్ వయసులో ప్రేమంటే ఎంతో ఆకర్షణ ఉంటుందని, కానీ దాని వల్ల అనేక అనర్థాలు కలుగుతాయని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఇండియా అధ్యక్షురాలు డాక్టర్ హిప్నో పద్మా కమలాకర్ అన్నారు. స్థానిక ప్రభుత్వ బీసీ కళాశాల బాలికల వసతి గృహంలో శనివారం బాలికల మనసు – వ్యక్తిత్వ సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ యుక్త వయసులో త్వరగా ప్రేమకు ఆకర్షితులవుతారన్నారు. ఆ సమయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ప్రేమకన్నా జీవితంలో సాధించాల్సిన లక్ష్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. స్నేహాలు, సరదాలు, అల్లరి ఎంతో సంతోషాన్నిచ్చే అనుభూతులే అయినప్పటికీ, వాటికి హద్దుంటుందని గమనించాలన్నారు. బాలికలు తమ సామర్థ్యాన్ని గుర్తించి, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. సైబర్ నేరాలు, సోషల్ మీడియా ప్రభావం, అసభ్యకర పోస్టులు, తప్పుడు సమాచారం, తప్పుడు స్నేహాల నుంచి ఎలా రక్షించుకోవాలి అనే దానిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సైకాలజిస్ట్ డాక్టర్ పి.రమేష్ కుమార్, హెచ్‌డబ్ల్యూవో వి.సత్యవాణి, బీసీ సంక్షేమ శాఖ అధికారి ముత్యాల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

శుభ్రం చేశారు... తేదీ వేశారు



బిక్కవోలులో ఓహెచ్ఆర్‌ను శుభ్రం చేసిన సిబ్బంది

సాక్షి ఇంపాక్ట్

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న ఓహెచ్ఆర్ నిర్వహణపై అధికారులు స్పందించారు. ఆ తాగునీటి ట్యాంకును శుభ్రం చేయించారు. దానిపై శుభ్రం చేసిన తేదీ వేసి, మళ్లీ ఎప్పుడు శుభ్రం చేయాలో రాశారు. కాగా.. తాగునీటి ట్యాంకుల నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఈ నెల 15న ఓహెచ్ఆర్‌ల నిర్వహణ గాలికి అనే శీర్షికతో సాక్షి పత్రికలో కథనం వచ్చింది. దానికి అధికారులు స్పందించి, ట్యాంకును శుభ్రం చేశారు.

వర్షంతో ప్రజలకు ఉపశమనం



అనపర్తి వద్ద పొలాల్లో కురుస్తున్న వర్షం

అనపర్తి: గడచిన వారం రోజులుగా మండుతున్న ఎండలతో అల్లాడిపోతున్న ప్రజలకు శనివారం సాయంత్రం కురిసిన వర్షం ఊరట కలిగించింది. మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమైంది. ఈదురుగాలులతో వాతావరణం చల్లబడడంతో ఉక్కపోతతో ఇళ్లలో ఫ్యాన్ల కింద కూర్చున్న జనం బయటకు వచ్చి కాస్త సేద తీరారు. అనపర్తిలో సుమారు అరగంట సేపు వాన కురిసింది. నియోజకవర్గవ్యాప్తంగా పలుచోట్ల వర్షం కురిసింది. దీంతో చల్లటి గాలులు వీయడంతో ప్రజలంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్‌పీఐ జిల్లా అధ్యక్షుడిగా బెన్నీరాజ్



మర్రా బెన్నీరాజ్



ఎంవీ లక్ష్మి

కోరుకొండ: రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ) ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడిగా మర్రా బెన్నీరాజ్ నియమితులయ్యారు. ఈ విషయాన్ని ఆయన శనివారం కోరుకొండలో విలేకరులకు తెలిపారు. అంబేడ్కర్ ఆశయాల సాధన కోసం ఆర్‌పీఐ పోరాటం చేస్తోందన్నారు. అలాగే తన భార్య ఎంవీ లక్ష్మి మహిళా విభాగం అధ్యక్షురాలిగా నియమించారన్నారు.

పీ ఫోర్ సర్వే వేగవంతం చేయాలి

బిక్కవోలు: పీ ఫోర్ సర్వేను వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి చేకూరి లక్ష్మి అన్నారు. ఈ మేరకు శనివారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో హౌసింగ్ స్టేజ్ కన్వర్షన్‌తో పురోగతి సాధించాలన్నారు. బాల్య వివాహాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

రాజానగరం: జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న తూర్పుగానుగూడెంలోని బస్టాండ్ షెల్టర్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని శనివారం స్థానికులు కనుగొన్నారు. గ్రామ వీఆర్వో ద్వారా సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని నిశితంగా పరిశీలించారు. అయితే ముఖం గుర్తు పట్టడానికి వీలు లేకుండా మారిపోయింది. అతడి ప్యాంటు జేబులోని ఆధార్ కార్డు ప్రకారం అతడి పేరు రొక్కం గిరిధర్, వయసు 40, గజపతి విలేజ్, ఒడిశా అని తెలుస్తోంది. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ వీరయ్య గౌడ్ తెలిపారు.

అపరిచితులతో చాటింగ్ ప్రమాదకరం

కంబాలచెరువు: తుమ్మలావ మున్సిపల్ స్కూలు, రాజమహేంద్రి కళాశాల విద్యార్థులు శనివారం సైబర్ నేరాలపై మూడో పట్టణ పోలీసులు అవగాహన కల్పించారు. జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్ ఆదేశాల మేరకు శక్తి యాప్‌పై జిల్లా శక్తి టీం, జిల్లా సైబర్ ల్యాబ్ పోలీసులు పలు విషయాలను వివరించారు. సైబర్ నేరాలపై విద్యార్థులు పూర్తిగా అవగాహన కలిగి ఉండి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సైబర్ నేరాలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయని, టెక్నాలజీని వాడుకుని నేరగాళ్లు డబ్బులు దోచుకుంటున్నారని, వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్‌లలో అపరిచితులతో చాటింగ్ చేయవద్దన్నారు. అనవసర యాప్‌లు, లింకులు, ఈ–మెయిళ్లతో హ్యాకర్లు మోసాలకు పాల్పడుతున్నారన్నారు.